క్లుప్తంగా

నేడు వాసవీ అమ్మవారి జయంత్యుత్సవం


యానాంలో కొలువైన వాసవీ కన్యకా పరమేశ్వరి

యానాం: యానాంలో కొలువైన వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి జయంత్యుత్సవం సందర్భంగా ఆదివారం ఆలయంలో వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధి పులవర్తి శ్రీనివాస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 5.30 గంటలకు సుప్రభాతసేవ, అభిషేకం, 108 రకాల హారతులతో అమ్మవారి వాహనం బయలుదేరుతుందన్నారు. అనంతరం సింహవాహంపై గ్రామోత్సవం, డోలోత్సవం, రాత్రి 9 గంటలకు అన్నసమారాధన కార్యక్రమం జరుగుతుందన్నారు. భక్తులందరూ విచ్చేసి అమ్మవారి దర్శనం చేసుకుని తరించాలని కోరారు.

నేటి నుంచి కన్యకాపరమేశ్వరి ప్రతిష్ఠా యజ్ఞ మహోత్సవాలు

తాళ్లరేవు: తాళ్లరేవు ప్రధాన రహదారిలో వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ యజ్ఞ మహోత్సవాలు ఈ నెల 30వ తేదీ ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. మొత్తంగా ఐదు రోజుల పాటు ప్రతిష్ఠా మహోత్సవాలు నిర్వహించడానికి ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. 30వ తేదీ ఉదయం మహిళలచే అధ్యయనోత్సవం, సాయంత్రం 4 గంటలకు గ్రామోత్సవం, మే 1వ తేదీన విశేష పూజ, వాసవీ చరిత్ర అధ్యయనం, 2న స్వస్తివాచకం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, 3న సప్తకలశారాధన, గోపూజ, గోదర్శనం, కుంభపూజ, 4వ తేదీ యంత్రస్థాపన, గోదర్శనం అనంతరం అన్న ప్రసాద కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

యువజన విభాగం కమిటీ ఎన్నిక

అల్లవరం: అల్లవరం మండల కాపు సంక్షేమ సేన యువజన విభాగం అధ్యక్ష కార్యదర్శులుగా ఆకుల రామ్‌కృష్ణప్రసాద్, నూకల వెంకటరమణలను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు డీఎస్‌ఎన్ కుమార్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. కాపు సంక్షేమ యువజన విభాగానికి కొత్తగా ఎంపికైన రామ్‌కృష్ణప్రసాద్, వెంకటరమణలకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

రెడ్డిపల్లి సర్పంచ్ దంపతులకు సన్మానం


సర్పంచ్ కరాటం ప్రసన్న ప్రవీణ్ దంపతులను సత్కరిస్తున్న గ్రామస్తులు

అమలాపురం రూరల్: మండలంలోని రెడ్డిపల్లి నీటి సంవృద్ధి కలిగిన ఉత్తమ గ్రామ పంచాయతీగా అవార్డు పొందినందుకు గాను సర్పంచ్ కరాటం ప్రసన్న ప్రవీణ్ దంపతులను గ్రామస్తులు, కార్యదర్శులు కట్టా సత్తిబాబు, స్వాతి, వీఆర్వో గంధం దొరబాబులు పూలమాలలతో ఘనంగా సత్కరించారు. గ్రామాభివృద్ధి కోసం నిరంతరం శ్రమించడం వల్లే అవార్డు వచ్చిందంటూ కొనియాడారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, గ్రామపెద్దలు గుత్తుల పార్థు, నల్లా సతీష్, రేలంగి శ్రీను, రేలంగి ఏసు తదితరులు పాల్గొన్నారు.

మే డే విజయవంతం చేయండి

రాజానగరం: మే డే సందర్భం సోమవారం రాజానగరంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమెక్రసీ, అఖిల భారత రైతు కూలీ సంఘాల ఆధ్వర్యంలో ప్రదర్శన జరుగుతుందని రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు జనిపెల్ల సత్తిబాబు తెలిపారు. కార్మికులందరూ ఈ ప్రదర్శనలో పాల్గొని, మే డే వేడుకలను విజయవంతం చేయాలన్నారు.

తాత మనవరాళ్లకు గాయాలు

ముమ్మిడివరం: మోటార్‌సైకిల్‌పై వెళుతున్న తాతమనవరాలు హైవే రోడ్డు దాటుతుండగా కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. క్రాప చింతలపూడికి చెందిన రామాయణం సూర్యప్రకాశరావు, అతని మనవరాలు ఝూన్సీ స్కూటీపై వెళుతూ కొండాలమ్మ బైపాస్ రోడ్డును దాటుతుండగా కాకినాడ వైపు వెళుతున్న కారు ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తాతా మనవరాలిని అమలాపురం కిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ కె.సురేష్‌బాబు తెలిపారు.

56 మందిపై కేసు

ఉప్పలగుప్తం: శ్మశానవాటిక వివాదంలో కొబ్బరి చెట్లు నరికివేసిన ఘటన మండలంలోని ఎస్.కొత్తపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ జి.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కోలా నరసింహమూర్తికి, గ్రామస్తులకు గత కొన్నిరోజులుగా శ్మశానవాటిక స్థలంపై వివాదం జరుగుతుంది. తాను ఎటువంటి భూఆక్రమణ చేయలేదని అధికారులు చెప్పినా, శుక్రవారం రాత్రి గ్రామస్తులు తన పొలం హద్దుల్లోని 27 చెట్లను యంత్రాల సహాయంతో నరికివేశారని నరసింహమూర్తి ఫిర్యాదులో చేశారు. దీంతో 56 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ కోతలకు చెక్

- రూ.3.51 కోట్ల ఖర్చుతో అధిక సామర్థ్యమున్న ట్రాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటు
- చిన్న తరహా పరిశ్రమలతో పాటు ఆక్వా రైతులకు మేలు


చల్లపల్లి సబ్‌స్టేషన్‌లో కొత్తగా ఏర్పాటుచేసిన అధిక సామర్థ్యమున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ఉప్పలగుప్తం: తరచూ లోఓల్టేజీ సమస్యతో ఏర్పడుతున్న విద్యుత్ కోతలకు చెక్ పడింది. ప్రభుత్వం చొరవ చూపి రూ.3.51 కోట్లతో అధిక ఓల్టేజీ గల ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేసి విద్యుత్ కష్టాలతో సతమతమవుతున్న వారికి విముక్తి కలిగించింది. దీంతో గృహ వినియోగదారులతో పాటు ఆక్వా రైతులు, చిన్నతరహా పరిశ్రమలకు కరెంట్ కోతల సమస్య వీడింది. కోనసీమలో లోఓల్టేజీ సమస్య నెలకొన్న ప్రాంతాలన్నింట్లో దశల వారీగా అధిక ఓల్టేజీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు చెబుతుండడం శుభసూచికం..

వినియోగదారులకు ఎంతో మేలు

ఉప్పలగుప్తం, అల్లవరం, కాట్రేనికోన మండలాల్లోని సబ్‌స్టేషన్ల పరిధిలో అనేకచోట్ల పూర్వం నుంచి తక్కువ ఓల్టేజీ గల ట్రాన్స్‌ఫార్మర్‌లే కొనసాగుతున్నాయి. అయితే రోజురోజుకీ గృహ విద్యుత్ వినియోగంతో పాటు చిన్నతరహా పరిశ్రమలు, ఆక్వా చెరువులకు సైతం విద్యుత్ అవసరాలు పెరిగాయి. దీంతో తక్కువ సామర్థ్యమున్న ట్రాన్స్‌ఫార్మర్‌లున్న చోట్ల లోఓల్టేజీ సమస్య తలెత్తి విద్యుత్ నిలిచిపోయేది. దీంతో అప్పుడప్పుడూ గంట నుంచి 2 గంటల విద్యుత్ కోత సమస్య తప్పేది కాదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఇదిలా ఉంటే పీటీఆర్(పవర్ ట్రాన్స్‌ఫర్) సమస్య ఎదురైతే రాజమండ్రి నుంచి సిబ్బంది వచ్చి మరమ్మతులు చేసేవరకూ విద్యుత్ నిలిపేయాల్సి వచ్చేది. ఈ సమస్యల్ని గుర్తించిన విద్యుత్ శాఖ ఎస్ఈ టీవీఎస్ఎన్ మూర్తి సలహాతో అధికారులు అప్రమత్తమై అధిక సామర్థ్యమున్న ట్రాన్స్‌ఫార్మర్‌ల్ని ఏర్పాటుచేసి ఆయా గ్రామాలకు పూర్తి స్థాయిలో విద్యుత్ సరఫరా అందిస్తున్నారు.

కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటు

- ఉప్పలగుప్తం మండలంలోని చల్లపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో గతంలో ఒక 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఉండేది. దీనికి అదనంగా రూ.98 లక్షల వ్యయంతో మరొక 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చారు. దీంతో సుమారుగా ఎనిమిది గ్రామాలకు విద్యుత్ సరఫరా పూర్తి స్థాయిలో అందుతుంది.
- అల్లవరం మండలంలోని దేవగుప్తం సబ్‌స్టేషన్‌లో రెండు 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఉండగా, ఇటీవల రూ.1.3 కోట్ల వ్యయంతో 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ అమర్చారు. దీనివల్ల ఆరు గ్రామాల ప్రజలకు లోఓల్టేజీ సమస్యకు పరిష్కారం లభించింది.
- కాట్రేనికోన మండలంలోని చెయ్యేరు సబ్‌స్టేషన్‌లో గతంలో రెండు 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఉండేవి. అందులో ఒకటి తొలగించి ఆ స్థానంలో రూ.1.23 కోట్ల వ్యయంతో 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో సుమారు తొమ్మిది గ్రామాల ప్రజలకు పూర్తిస్థాయిలో సరఫరా అందుతుంది.

విద్యుత్ కొరత తీరింది



గతంలో ఆక్వా సాగులో విద్యుత్ కొరతతో తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. అప్పట్లో చెరువుల్లో ఏరియేటర్‌లు తిరగడానికి లోఓల్టేజీతో సమస్యలు ఎదుర్కొన్నాం. ఇటీవల దేవగుప్తం సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌తో విద్యుత్ కొరత, లోఓల్టేజీ సమస్య నుంచి బయటపడ్డాం.
– చదల్ల వాసుదేవుడు, ఆక్వా రైతు, సామంతకుర్రు

విద్యుత్ సరఫరా మెరుగైంది



గతంలో తరచూ విద్యుత్ కోతలుండేవి. చల్లపల్లి సబ్‌స్టేషన్ వద్ద అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో గతం కంటే ఇప్పుడు రొయ్యల చెరువులకు విద్యుత్ సరఫరా మెరుగైంది. ప్రభుత్వం సమస్యను గుర్తించి ట్రాన్స్‌ఫార్మర్లు మార్చడం హర్షణీయం.
– దంగేటి దొరబాబు, ఆక్వారైతు, చల్లపల్లి

లోడు పెంచుతున్నాం



లోఓల్టేజీ, విద్యుత్ కోతలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అవసరమైన చోట లోడు పెంచుతున్నాం. ప్రస్తుతం ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్‌లతో 4 నుంచి 5 ఏళ్ల పాటు విద్యుత్ సమస్య ఉండదు. మరిన్ని లోఓల్టేజీ ప్రాంతాలను గుర్తించి సమస్య పరిష్కరిస్తాం.
– ఎ.వీరభద్రరావు, డీఈఈ, ముమ్మిడివరం

తాగునీటి చెరువులను పరిశీలించిన ఎమ్మెల్యే అశోక్


చెరువులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అశోక్ తదితరులు

యానాం: యానాం నియోజకవర్గానికి తాగునీటి అవసరాలు తీరుస్తున్న 55 ఎకరాల విస్తీర్ణంలోని చెరువులను శనివారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పరిశీలించారు. పిల్లంక-బ్రహ్మపురి మధ్యలో ఉన్న ఫ్రెంచి కెనాల్ నుంచి నీటి ప్రవాహం పెరగడంతో రెండు చెరువుల్లో నీటిని నింపుతున్నారు. ఈ నేపథ్యంలో చెరువుల్లో నీటిమట్టం తదితర పరిస్థితుల్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా ధవళేశ్వరం వెళ్లి ఇరిగేషన్ సూపరింటెండెంట్ ఇంజినీరును కలిసి సమస్య తీవ్రతను తెలపగా ప్రత్యేక నీటి వంతు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. దీంతో కొద్దిరోజులుగా నీటిని రెండు చెరువుల్లో నింపుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కనకాల రాజు, పండు సిద్ధార్థకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా వారోత్సవాలపై అవగాహన


రహదారి భద్రతపై సూచనలిస్తున్న ఎస్‌ఐ శ్రీను నాయక్

అల్లవరం: జిల్లా ఎస్పీ శ్రీధర్ ఆదేశాల మేరకు అల్లవరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆటో, వాహనదారులు, పౌరులకు రోడ్డు భద్రతా వారోత్సవాలపై ఎస్‌ఐ శ్రీనునాయక్ శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ శ్రీనునాయక్ మాట్లాడుతూ వాహనదారులు ప్రతిఒక్కరూ నియమ నిబంధనలు పాటించాలన్నారు. ఆటో ఎక్కే మహిళా ప్రయాణికుల పట్ల డ్రైవర్లు సోదర భావం కలిగి ఉండాలన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు డ్రైవర్లు స్వతరమే స్పందిస్తే ప్రాణాలు కాపాడొచ్చని చెప్పారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, డ్రైవర్లు పాల్గొన్నారు.

దళిత బలహీనవర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్


కామనగరువులో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి విశ్వరూప్


అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న మంత్రి విశ్వరూప్

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్

అమలాపురం రూరల్: దళిత బలహీనవర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. కామనగరువు పసిడి చెరువులో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని మంత్రి విశ్వరూప్ శనివారం ఆవిష్కరించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ శిల్పి బాబాసాహెబ్ అంబేడ్కర్ నిరుపేదల గుండెల్లో గూడు కట్టుకున్నారని ఆయన చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోతారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు పందిరి హరిరామ్‌గోపాల్, గెద్దం సంపత్‌రావు, సర్పంచ్ నక్కా అరుణకుమారి, ఉపసర్పంచ్ రాజులపూడి భాస్కరరావు, ఎంపీటీసీ మెండు గంగా భవానీ, దళిత ఐక్య వేదిక చైర్మన్ డీబీ లోక్, కన్వీనర్ జంగా బాబురావు, ఇసుకపట్ల రఘుబాబు, ఉంద్రు బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం: మండలంలోని గుడ్డివానిచింత సెంటర్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ శనివారం ఆవిష్కరించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ చెప్పిన మూడు సూత్రాలు బోధించు, సమీకరించు, పోరాడు.. ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. అనంతరం మాజీ ఎంపీటీసీ చికిలే చిట్టిబాబు ఆధ్వర్యంలో అంబేడ్కర్ జీవితచరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల వేషగిరిరావు, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, తుని నియోజకవర్గ పార్టీ పరిశీలకులు చెల్లుబోయిన శ్రీను, సర్పంచ్‌లు దాకారపు చిరంజీవిరావు, రొక్కాల విజయలక్ష్మి, తోట శ్రీదేవి, బొమ్ము బాలవేణి, నడింపల్లి సుబ్రహ్మణ్యం, సాధనాల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలకు చంద్రబాబు చేసింది శూన్యం

జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్

అమలాపురం టౌన్: చంద్రబాబు పాలనలో మైనార్టీలకు ఒనగూరిన సంక్షేమం శూన్యమని జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ శనివారం ఓ ప్రకటనలో విమర్శించారు. తిట్టిన నోటితోనే పొగడడం, అధికారం కోల్పోయినప్పుడు బీసీలు, ఎస్సీలు, మైనార్టీలు అంటూ ప్రేమ ఒలకబోసి వారిని గుర్తుకు తెచ్చుకోవడం చంద్రబాబుకు బాగా అలవాటైపోయిందన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో మైనార్టీలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు కాలేదన్న విషయం మైనార్టీలకు తెలుసన్నారు. అధికారంలో ఉంటే అహంకారంతో, అధికారంలో లేకపోతే అవసరం కోసం మాట్లాడడం చంద్రబాబు నైజమని దుయ్యబట్టారు. నాడు చంద్రబాబు మైనార్టీలకు మొండి చేయి చూపిస్తే నేడు జగన్ రూ.22 వేల కోట్ల మేర మైనార్టీల సంక్షేమానికి వెచ్చించారన్నారు.

వాకర్స్ సభ్యులకు ఆటల పోటీలు

అమలాపురం టౌన్: వాకర్స్ హెల్త్ క్లబ్, మహిళా వాకర్స్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన కుటుంబ ఆత్మీయ కార్యక్రమాల్లో భాగంగా స్థానిక చంద్రబాబు ఉద్యానవనంలో వాకర్స్ ఆటల పోటీలు శనివారం జరిగాయి. ఆటలను వాకర్స్ అంతర్జాతీయ మాజీ అధ్యక్షుడు డాక్టర్ పీఎస్ శర్మ జెండా ఊపి ప్రారంభించారు. వాకర్స్ తమ వయసులను మరిచి యువతీయువకుల్లా ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. నడక, పరుగు, బాల్ త్రో, షాట్ పుట్ తదితర ఆటలు ఆడారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, మహిళా వాకర్స్ అధ్యక్షురాలు పుత్సా రాజేశ్వరి, క్లబ్ కార్యదర్శి పుత్సా కృష్ణ కామేశ్వర్, ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, రంకిరెడ్డి కాశీ, యర్రమిల్లి అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన అవసరం

ముమ్మిడివరం: క్షయ వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకుని వ్యాధి నివారణకు ప్రభుత్వం చేపట్టే చర్యలను సద్వినియోగం చేసుకోవాలని ముమ్మిడివరం సామాజిక ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దయానా కోరారు. ప్రధానమంత్రి టీబీ ముక్తాభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పీపుల్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. క్షయవ్యాధి ఊపిరితిత్తులకు సంబంధించి శరీరంలో ఏ భాగానికైనా వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పీపుల్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్ వి.శ్రీనివాసరావు, టి.వెంకటలక్ష్మి, సీహెచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమ పథకాలు


ఎస్.రామేశ్వరంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న శ్రీకాంత్

అల్లవరం: గ్రామాల్లో అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని పినిపే శ్రీకాంత్ అన్నారు. ఎస్.పల్లిపాలెం పంచాయతీ పరిధిలోని ఎస్.రామేశ్వరంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంత్రి విశ్వరూప్ కుమారుడు శ్రీకాంత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల పనితీరుపై లబ్ధిదారుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలకు ప్రకటించిన హామీల్లో 95 శాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదని తెలిపారు. గడప గడపకూ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చొరవ తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, సర్పంచ్‌లు కొల్లు వెంకటరమణ, రాకాపు విజయలక్ష్మి, అగ్నికులక్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి వెంకటరామరాజు, పెమ్మాడి సాయి, ఎంపీటీసీ పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, బొంతు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సమగ్ర సర్వే

అమలాపురం రూరల్: ఎలక్ట్రికల్ వర్కర్స్ సమస్యల పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర సర్వే యాత్ర చేపట్టినట్లు ఏపీ ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డీవీ సత్యనారాయణ అన్నారు. ఈదరపల్లి లక్ష్మీనరసింహస్వామి నగర్ యూనియన్ భవనంలో అమలాపురం ఎలక్ట్రికల్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సమావేశం జరిగింది. కార్మికులకు బీమాతో పాటు కుటుంబ సభ్యుల వివాహం, పురుడు సమయంలో ఇచ్చే ఆర్థిక సాయం, ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణను జిల్లా అధ్యక్షుడు కొప్పిశెట్టి వనమయ్య కోరారు. సమావేశంలో రాష్ట్ర అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.హరిరావు, కోశాధికారి ఎం.శ్రీధర్ రవిబాబు, కట్టా వెంకటరమణ, కాళ్ల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన


సీసీ రహదారికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ శామ్యూల్ సాగర్

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు పరదేశమ్మపేట ఓల్డ్ ఎస్‌బీఐ ఎదురుగా ఉన్న వీధికి చెందిన ప్రజలు రహదారి సౌకర్యం లేక పడుతున్న ఇబ్బందులు తీరనున్నాయి. వర్షం వస్తేచాలు ఆ ప్రాంతమంతా చెరువుని తలపించేది.

తాళ్లరేవు జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్ పరిస్థితిని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లడంతో నిధులు మంజూరయ్యాయి. రూ.7.4 లక్షల జిల్లా పరిషత్ నిధులను కేటాయించి 125 మీటర్ల మేర సీసీ రహదారిని నిర్మించేందుకు శనివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, జెడ్పీ మాజీ చైర్మన్ దున్నా జనార్దనరావు, స్థానిక సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవి తదితరులు పాల్గొన్నారు.

చిట్టబ్బాయికి ఘన నివాళులు

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే కుడుపూడి చిట్టబ్బాయి రెండో వర్ధంతి కార్యక్రమం స్థానిక సూర్యనగర్‌లోని చిట్టబ్బాయి స్వగృహం వద్ద శనివారం ఉదయం జరిగింది. చిట్టబ్బాయి భార్య అరుణ, ఆయన కుమారుడు కుడుపూడి భరత్‌భూషణ్, కోడలు రాష్ట్ర దృశ్య కళల అకాడమీ చైర్‌పర్సన్ సత్య శైలజ తదితరులు చిట్టబ్బాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, టీటీడీ ధర్మ పరిషత్ సభ్యుడు పీకే రావు, క్షైముజు రమణ, కాంతిభూషణ్ తదితరులు హాజరయ్యారు.

బాలిక అదృశ్యం

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి గ్రామానికి చెందిన మైనర్‌బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ జి.వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం బాలిక గ్రామంలో తన అమ్మమ్మ గారి ఇంటి వద్ద ఉంటుంది. అదే గ్రామంలో వలంటీర్‌గా విధులు నిర్వర్తిస్తున్న విజయబాబు ఆమెతో తరచూ మాట్లాడేవాడు. శనివారం ఉదయం నుంచి ఇద్దరూ కనిపించకపోవటంతో బాలిక అమ్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

వరి పనలను ఒబ్బిడి చేసుకోవాలి

అల్లవరం: నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో వరి క్షేత్రాల్లోని వరి పనలను సత్వరమే ఒబ్బిడి చేసుకోవాలని తహసీల్దార్ సాంబశివప్రసాద్ శనివారం తెలిపారు. మండలంలోని కోడూరుపాడు, రెల్లుగడ్డ, అల్లవరం గ్రామాల్లోని వ్యవసాయ వరి క్షేత్రాలను ఎంపీడీఓ జి.సరోవరరావు, వ్యవసాయాధికారి ఎస్‌వీవీ సత్యనారాయణతో కలిసి పరిశీలించారు. వరి కోతలు కోయని రైతులు వాయిదా వేసుకోవాలన్నారు. ధాన్యం రాశులు, వరి పనలను ఒబ్బిడి చేసి బరకాలతో కప్పి ఉంచాలని సూచించారు. అధికారుల వెంట రైతులు కొనుకు బాపూజీ, బొమ్మి చంద్రరావు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

యువతకు కళల ప్రాధాన్యతను తెలియజేయాలి

పుదుచ్చేరి స్పీకర్ ఆర్.సెల్వం


స్పీకర్ ఆర్.సెల్వం నుంచి కలైమామణి అవార్డు స్వీకరిస్తున్న డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి

యానాం: కళలు, సంస్కృతిల ప్రాధాన్యతను నేటి యువతరానికి తెలియజెప్పాల్సిన ఆవశ్యకత ఉందని పుదుచ్చేరి స్పీకర్ ఆర్.సెల్వం పేర్కొన్నారు. శనివారం పుదుచ్చేరి కళలు, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలందించిన వారికి కలైమామణి అవార్డుల ప్రదానోత్సవ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుదుచ్చేరి నాలుగు రీజియన్‌ల్లో తమిళం, తెలుగు, మళయాళం భాషలతో పాటు అనేక సాంస్కృతిక అంశాలు మిళితమై ఉన్నాయని, వాటిని పరస్పరం గౌరవించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. అనంతరం యానాంకు చెందిన స్థానిక సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వరుగుభాస్కరరెడ్డి(సాహిత్యం), ఎన్‌గ్రేవింగ్ సీనియర్ కళాకారుడు గ్రంధి సత్యనారాయణ(కళారంగం), విశ్రాంత జేఈ కోరుకొండ ప్రసాదరావు(నాటకరంగం)లకు కలైమామణి అవార్డులను అందజేశారు. చిత్రకళారంగం నుంచి అవార్డుకు ఎంపికైన ముమ్మిడి చిన్నారి అనివార్య కారణాలతో పుదుచ్చేరి వెళ్లలేకపోయారు. కార్యక్రమంలో మంత్రులు ఇందిరాప్రియాంక, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కుల నిర్మూలనకు పోరాటాలే మార్గం

అమలాపురం టౌన్: కుల నిర్మూలన సాధించడానికి, సామరస్య జీవనానికి కుల, వర్గ పోరాటాలను జమిలిగా సాగించాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జాతీయ చైర్‌పర్సన్ విమలక్క పిలుపునిచ్చారు. అమలాపురంలోని కిరణా మర్చంట్స్ హాలులో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం (ఏపీఆర్‌సీఎస్) ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శి బి.రమేష్ అధ్యక్షతన శనివారం జరిగిన సభకు విమలక్క ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తొలుత గడియారం స్తంభం సెంటర్ నుంచి సభా స్థలి వరకూ ప్రదర్శన నిర్వహించారు. జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, లెనిన్, విప్లవ అమరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో కర్షకుల వీరాంజనేయులు, ఏడిద రాజేష్, బొంతు రమణ, కొంకి రాజామణి తదితరులు పాల్గొన్నారు.